శనివారం ఆదిలాబాద్‌లో జరిగిన బహిరంగసభలో ప్రసంగిస్తున్న ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, పక్కన ఆదిలాబాద్, బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థులు జోగు రామన్న, అనిల్‌జాదవ్, చిత్రంలో సభకు పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు

తెలంగాణ ద్రోహుల చేతిలో కాంగ్రెస్

- కాంగ్రెస్ పార్టీలో కుర్చీల కోసం కొట్లాట
- అలాంటి వాళ్ల తో రాష్ట్రం బాగుపడదు
- రైతుబంధు వద్దన్నోళ్లను బొందపెట్టాలి
- బీఆర్ఎస్ సెంచరీ కొట్టడం ఖాయం
- పదేండ్లలో కరువు లేదు, కర్ఫ్యూ లేదు
- ఏటా కొత్తగా 10 వేల మంది డాక్టర్లు
- ఆదిలాబాద్, ఉట్నూర్, స్టేషన్ ఘన్‌పూర్ సభల్లో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు

ఆదిలాబాద్, జనగామ అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ద్రోహుల చేతిలో కాంగ్రెస్ ఉన్నదని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్ రావు అన్నారు. రైతుబంధును ఇవ్వొద్దని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన ఆ పార్టీని బొంద పెట్టాలని తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు. రైతులంటే హస్తం పార్టీకి మొదట్నుంచీ పగ అని, అందుకే పెట్టుబడి సాయాన్ని ఆపాలని ఈసీకి లేఖ రాసిందని మండిపడ్డారు. ఆదిలాబాద్, ఉట్నూర్ ప్రజా ఆశీర్వాద సభలు, స్టేషన్ ఘన్‌పూర్‌లో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి హరీశ్ హాజరయ్యారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియంతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఇంటికి వెళ్లిన మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు అక్కడ తేనీటి విందు స్వీకరించి పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయా సభల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సెంచరీ కొట్టడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్‌లో అభ్యర్థులు లేక పక్క పార్టీల వాళ్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు టికెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు టికెట్ల కోసం నెల రోజులుగా ఢిల్లీలో ఉన్నారని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అక్కడ తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టుకుండా, స్వయం పాలన అందించే కేసీఆర్ చేతిలో రాష్ట్రం ఉంటేనే పదిలంగా ఉంటుందని చెప్పారు. ఓటుకు నోటు దొంగల చేతిలో తెలంగాణ ఉండాలా? కేసీఆర్ లాంటి త్యాగధనుడి చేతిలో ఉండాలో ప్రజలు ఆలోచించాలని సూచించారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీకి ఓటమి తప్పదని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావటం ఖాయమని హరీశ్ స్పష్టం చేశారు. బీజేపీ గత ఎన్నికల్లో ఒకే అసెంబ్లీ స్థానంలో గెలుపొందిందని, ఈసారి డకౌట్ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా రాదన్నారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఏ ముఖం పెట్టుకుని తెలంగాణలో ప్రచారానికి వచ్చారని ప్రశ్నించారు. కర్ణాటకలో కరెంటు కోసం రైతులు కరెంటు ఆఫీసుల్లో మొసళ్లను వదులుతున్నారని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికులను సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, కానీ బీజేపీ నాయకులు దీన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని, జనవరి 1 నుంచి వాళ్లు ప్రభుత్వ ఉద్యోగులుగా జీతం అందుకుంటారని వెల్లడించారు.



స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

> కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డే చెప్పిండు. రూ.50 కోట్లు పెట్టి రేవంత్‌రెడ్డి పీసీసీ పదవి కొన్నడని. రూ.50 కోట్లు ఇచ్చింది నిజమైతే ఎవరికి ఇచ్చారో రాహుల్ గాంధీ బయపట్టాలి. అది నిజం కాకపోతే ఆ ఆరోపణ చేసిన కోమటిరెడ్డి మీద చర్య తీసుకోవాలి. ఆయన మీద చర్య తీసుకోరు. ఈయన ఎవరికి డబ్బులు ఇచ్చాడో చెప్పరు. దీన్ని బట్టి అర్థమయ్యేదేమిటంటే కోమటిరెడ్డి చెప్పింది నిజం అని. - మంత్రి హరీశ్‌రావు

పదేండ్లలో కరువు లేదు, కర్ఫ్యూ లేదు

నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు అనుకూలమైన నిర్ణయం తీసుకోబోతున్నారని మంత్రి హరీశ్ తెలిపారు. ఈసారి సెంచరీ కొట్టడం ఖాయమని కుండబద్దలు కొట్టారు. పదేండ్లలో రాష్ట్రంలో కరువు లేదు, కర్ఫ్యూ లేదని వెల్లడించారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉన్నదని వివరించారు. ప్రతి సంవత్సరం 10 వేల మంది డాక్టర్లను దేశానికి అందిస్తున్నదని స్పష్టం చేశారు. కుర్చీల కోసం కొట్లాడేవారి చేతిలో తెలంగాణ పెడితే బాగుపడదని అన్నారు. కాంగ్రెస్‌లో ప్రతి నియోజకవర్గంలో ముష్టియుద్ధాలు, రాజీనామాలు, దిష్టిబొమ్మల దహనం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఆ పార్టీ తెలంగాణ ద్రోహులు, అవినీతిపరుల చేతుల్లోకి వెళ్లిందని విరుచుకుపడ్డారు.

మైనార్టీలకు భారీ బడ్జెట్

'ముస్లిం మైనార్టీలకు దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ నిధులు కేటాయిస్తున్నది. ఉత్తరప్రదేశ్‌లో 4 కోట్ల మంది ముస్లిం జనాభా ఉంటే రూ.400 కోట్లు, బెంగాల్‌లో 2.40 కోట్ల జనాభా ఉంటే రూ.18 కోట్లు, మహారాష్ట్రలో 1.40 కోట్ల జనాభా ఉంటే రూ.1,600 కోట్లు, కర్ణాటకలో 90 లక్షలు ఉంటే రూ.2,100 కోట్లు కేటాయిస్తే, మన రాష్ట్రంలో 50 లక్షల జనాభాకు రూ.2,200 కోట్లు కేటాయిస్తున్నది' అని హరీశ్‌రావు తెలిపారు. కరువుతో విలయతాండం చేసిన స్టేషన్ ఘన్‌పూర్ ప్రాంతాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసిన బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ స్వామిగౌడ్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ అభ్యర్థి అనిల్ జాదవ్ పాల్గొన్నారు.



కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా

74 స్థానాలతో బీఆర్ఎస్‌దే విజయం

29 సీట్లతో రెండో స్థానానికే కాంగ్రెస్ పరిమితం

6 సీట్లతో బీజేపీకి నాలుగోస్థానం.. ఎన్‌పీఐ ఒపీనియన్ పోల్‌లో వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జైత్రయాత్ర కొనసాగుతుంది.. కేసీఆర్ సారథ్యంలోని గులాబీ పార్టీ హ్యాట్రిక్ విజయంతో రికార్డు సృష్టిస్తుంది. ఇటీవల విడుదలైన ప్రముఖ సర్వేలన్నీ ఘంటాపథంగా చెప్తున్నదిదే. ఇండియా టీవీ, ఫ్యాక్ట్ మార్కెటింగ్ సంస్థ, మిషన్ చాణక్య సర్వేలు బీఆర్ఎస్‌కే విజయావకాశాలున్నాయని స్పష్టం చేయగా.. తాజాగా నేషనల్ సెఫాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌పీఐ) నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తున్నట్టు వెల్లడైంది. బీఆర్ఎస్‌కు 41.2 శాతం ఓట్లతో 74 (ఐదు సీట్లు అటుఇటుగా) సీట్లు వస్తాయని సర్వేలో తేలింది. కాంగ్రెస్ 29 (3 సీట్లు అటు ఇటుగా) సీట్లకు, బీజేపీ 6 (రెండు సీట్లు అటుఇటుగా) సీట్లకు పరిమితమవుతాయని వెల్లడైంది. గడిచిన పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు అంతర్గత కుమ్ములాటలు, మతతత్వాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య అగాధాలను సృష్టించే పార్టీలపట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. కాంగ్రెస్ పొరుగు రాష్ట్రంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో తెలంగాణ ప్రజలు వారిని నమ్మడంలేదు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నిర్వహించిన ఒపీనియన్ పోల్ ప్రకారం 41.2 శాతం ఓట్లతో బీఆర్ఎస్ 74 స్థానాలు సాధించే వీలుండగా, కాంగ్రెస్ పార్టీ 32.7 శాతం ఓట్లతో 29 స్థానాలు సాధిస్తుందని, 2.7 శాతం ఓట్లతో ఏడు స్థానాలు సాధించి మజ్లిస్ పార్టీ మూడో స్థానంలో, 14.3 శాతం ఓట్లు, ఆరు సీట్లతో బీజేపీ నాలుగో స్థానాల్లో ఉంటాయని వెల్లడించింది. అన్ని పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేసిన అనంతరం తమ ఫైనల్ ప్రీ-పోల్ సర్వే వివరాలను వెల్లడించనున్నట్టు ఎన్‌పీఐ ప్రతినిధులు తెలిపారు.

తెలంగాణలో బీఆర్ఎస్‌దే అధికారం

గ్రామీణ ఓటు గులాబీ పార్టీదే.. కాంగ్రెస్‌కు అధికారం అసాధ్యం

సీఎస్‌డీఎస్ లోక్‌నీతి సర్వేయర్, ప్రొఫెసర్ సంజయ్‌కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారం చేపట్టనున్నదని సెంటర్ ఫర్ స్టడీస్ ఆఫ్ డెవలప్‌మెంట్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) లోక్‌నీతి సర్వేయర్, ప్రొఫెసర్ సంజయ్ కుమార్ తేల్చి చెప్పారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలపై శనివారం ఓ టీవీ చానల్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదు రాష్ట్రాల ఎన్నికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఎన్నికలపై స్పందిస్తూ.. 'కాంగ్రెస్ గెలుస్తుందని నేను అనుకోవటం లేదు. బీఆర్ఎస్ కచ్చితంగా లీడ్‌లో ఉన్నది. సంక్షేమ పథకాలతో గ్రామీణ ఓటర్లంతా ఆ పార్టీవైపే ఉన్నారు. నాకున్న అంచనా ప్రకారం అక్కడ కాంగ్రెస్‌కు అధికారం దక్కటం అసాధ్యం. ఎన్నికలపై పోల్స్ విషయంలో కచ్చితమైన ఆధారం అంటూ ఏదీ లేదు. వాటిని నమ్మలేం. ఏ పద్ధతిలో పోల్స్ నిర్వహిస్తారు? అన్నది ఎవరూ చెప్పరు' అని పేర్కొన్నారు.

నమ్మి వస్తే.. నట్టేట ముంచిన బీజేపీ

- ఉద్యమకారులను విస్మరించింది
- ప్రజాగాయకుడు దరువు ఎల్లన్న
- కమలం పార్టీకి రాజీనామా చేసినట్టు ప్రకటన

ఇల్లంతకుంట, అక్టోబర్ 28: బీజేపీని నమ్ముకొని వచ్చిన ఉద్యమకారులను రాజకీయంగా ప్రోత్సహించకుండా నట్టేట ముంచిందని, విద్యార్థినాయకులను పూర్తిగా విస్మరించిందని ప్రజాగాయకుడు దరువు ఎల్లన్న విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వైశ్యభవన్‌లో శనివారం మీడియా సమావేశం లో మాట్లాడారు. విద్యార్థి ఉద్యమ నేత లకు చట్టసభల్లో అవకాశం కల్పిస్తామని చెప్పిన బీజేపీ.. ప్రస్తుత ఎన్నికల సమయంలో పట్టించుకోవడం లేదని మం డిపడ్డారు. సరైన గుర్తింపు లేకపోవడంతో బీజేపీకి రాజీనామా చేస్తున్నట్టు దరువు ఎల్లన్న ప్రకటించారు. తనతోపా టు ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాల కు చెందిన 22 మంది కీలక నాయకు లు రాజీనామా చేశారని తెలిపారు.

నాకు బీజేపీ టికెట్ వద్దు!

- సినీనటుడు బాబుమోహన్

ఖైరతాబాద్, అక్టోబర్ 28: ఈసారి తాను బీజేపీ నుంచి పోటీ చేయబోనని, పార్టీకీ దూరంగా ఉంటానని, తనకు టికెట్ కేటాయించాల్సిన అవసరం లేదని బీజేపీ నేత, సినీనటుడు బాబుమోహన్ స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అధిష్ఠానం పట్ల అసంతృప్తిని వెలిబుచ్చారు. ఆందోల్ నుంచి తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా, క్యాబినెట్ మంత్రిగా పనిచేశానని చెప్పారు. బీజేపీలో తాను ఎన్నడూ టికెట్ ఆశించలేదని, కానీ టికెట్ల కేటాయింపు విషయాన్ని పార్టీ అధిష్ఠానం తనకు తెలియకుండా రహస్యంగా దాచిపెట్టడం సబబు కాదని చెప్పారు. తనకు, తన కొడుకు మధ్య పోటీ అని కొందరు ట్రోల్ చేశారని తెలిపారు. బీజేపీ పెద్దల నిర్ణయం ఆధారంగా పార్టీలో ఉండాలో, వెళ్లిపోవాలో త్వరలోనే ప్రకటిస్తానని చెప్పారు.

తుమ్మల కంటే ఊసరవెల్లే నయం

- అవసరాల కొద్ది పార్టీలు మారడం అలవాటు
- ప్రజలకు సేవచేసే ఆలోచన ఎప్పుడూ లేదు
- మీడియా సమావేశంలో మంత్రి పువ్వాడ ఫైర్

ఖమ్మం బీఆర్ఎస్ ఆఫీసులో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్. చిత్రంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు, పాలేరు ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం, అక్టోబర్ 28 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): మాజీ తుమ్మల నాగేశ్వరరావు రాజకీయాల్లో చూపించే రంగులు అన్నీ ఇన్నీ కావని, ఆయనకంటే ఊసరవెల్లే నయమని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఫైర్ అయ్యారు. ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తుమ్మలపై దయతలచి సీఎం కేసీఆర్ మంత్రి పదవి ఇచ్చారని, లేకపోతే పదేండ్ల క్రితమే ఆయన రాజకీయ జీవితం ముగిసిపోయేదని చెప్పారు. అలాంటి తుమ్మల నేడు కేసీఆర్‌పై అవాకులు చెవాకులు పేలుతుంటే బీఆర్ఎస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే దగ్గరుండి ఆయనను ఇంట్లో కూర్చోబెడతారని తెలిపారు. అవసరానికి తగినట్టు పార్టీలు మారడం తుమ్మలకే చెల్లిందని, పదవుల కోసమే తప్ప ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన తుమ్మలకు ఎప్పుడూ లేదని విమర్శించారు. అనంతరం పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 'పాలేరు సభలో సీఎం కేసీఆర్ చెప్పిన మాటలు అక్షర సత్యం. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. అబద్ధాలు చెప్తూ మోసం చేయాలని చూడడం సరికాదు. రాజకీయ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలి. నేను ఎమ్మెల్యే అయిన తర్వాత ఒక్క కాంట్రాక్ట్ తీసుకున్నట్టు నిరూపించినా నేను ఎన్నికల నుంచి తప్పుకుంటా. నాపై అసత్య ఆరోపణలు సరికాదు' అని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీఎస్ సెట్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 28: రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టుల అర్హతకు నిర్వహించే టీఎస్ సెట్-2023 పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. రోజూ రెండు సెషన్లలో మూడు రోజులు జరుగనున్నాయి. ప్రశ్నాపత్రం సెట్‌ను ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ విడుదల చేశారు.

SALAR JUNG MUSEUM, HYDERABAD
e-Publishing Notice

Tenders are in invited under e-publishing platform for **"Refilling of Fire Extinguishers in the Salar Jung Museum for the Period from November 2023 to October 2025."**
Tenderers can download the tender schedules from procurement site i.e www.eprocure.gov.in/CPPP. Submission of tenders offline at Salar Jung Museum, Hyderabad.

Bid publish date	:	28.10.2023, 1.00 PM
Bid Submission closing date	:	07.11.2023, 3.00 PM
Bid opening Date	:	07.11.2023, 3.30 PM

Further details can be seen at **www.eprocure.gov.in/cppp.**
- Tender ID No.2023_SJM_732288_1
Sd/-
DIRECTOR



బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజును కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్‌లో బీజేపీకి భారీ షాక్

- కాషాయ పార్టీకి గడ్డం నాగరాజు రాజీనామా
- త్వరలో బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు సన్నాహాలు
- స్వాగతం పలికిన ఎమ్మెల్యే రసమయి, జీవీఆర్

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 28: మానకొండూర్ నియోజకవర్గంలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ మానకొండూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి గడ్డం నాగరాజు టికెట్ రాకపోవడంతో నిరాశచెంది కాషాయ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌తోపాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు స్వయంగా మానకొండూర్ మండల కేంద్రంలోని గడ్డం నాగరాజు ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. తన ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే, జీవీఆర్‌ను నాగరాజు శాలువాలతో సన్మానించారు. ఎమ్మెల్యే, జీవీఆర్ మాట్లాడుతూ.. నాగరాజు మానకొండూర్ నియోజకవర్గంలో చేసిన సేవలను గుర్తించి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, ఆయనను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించామని తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ.. త్వరలో భారీ సంఖ్యలో తమ అనుచరులతోపాటు మరింత మంది బీజేపీ కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ పార్టీలో చేరతానని చెప్పారు.

భూస్థాపిత బీజేపీ నుంచి బీసీ ముఖ్యమంత్రా?

- ఇప్పటిదాకా బీసీలకు చేసిన మేలేమిటో చెప్పాలి
- బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భూస్థాపితమైపోయిన బీజేపీ.. ఎన్నికల్లో గెలిస్తే బీసీని సీఎం చేస్తారా? అని బీఆర్ఎస్ సీనియర్‌నేత దాసోజు శ్రవణ్ ఎద్దేవా చేశారు.. కేంద్రమంత్రి అమిత్‌షా అబద్ధాల అనకొండగా మారారని విమర్శించారు. అమిత్ షా చేసిన బీసీ సీఎం హామీ బూటకమేనని శనివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. బీజేపీ చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను తెలుసుకోగలిగే విజ్ఞత తెలంగాణ ప్రజలకు ఉనదని తెలిపారు. తెలంగాణ ప్రజలు బీజేపీని అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ 2014లో వెనుకబడిన వర్గాల నాయకుడని నరేంద్ర మోదీని చూపించి.. అధికారం దక్కించుకొని.. ఆ తరువాత బీసీలకు చేసిన మేలేమిటో చెప్పాలని సవాల్ చేశారు. దేశవ్యాప్తంగా బీసీలను దారుణంగా అణచివేసిన బీజేపీ తెలంగాణ ఓటర్లను మభ్యపెట్టాలని బూటకపు నినాదం ఎత్తుకున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం పగటికలేనని తేల్చిచెప్పారు. కేంద్రమంత్రి అమిత్‌షాకు ఆయన కొన్ని ప్రశ్నలు సంధించారు.

- రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బీసీని ఎందుకు తొలగించారు?
- బీసీ కులగణనను ఎందుకు నిర్వహించలేకపోతున్నారు?
- కేంద్రప్రభుత్వంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఎందుకు లేదు?
- ఓబీసీ రిజర్వేషన్ల బిల్లును ఎందుకు ప్రవేశపెట్టలేదు?
- జాతీయ ఓబీసీ కమిషన్‌ను ఎందుకు బలహీనం చేశారు?
- జాతీయ ఓబీసీ కార్పొరేషన్‌ను ఎందుకు నిర్లక్ష్యం చేశారు?
- ఓబీసీలకు ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించకుండా.. వారి పట్ల మీ ప్రభుత్వం ఎందుకు వివక్ష చూపుతున్నది?
- బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో ఎందుకు విఫలమైంది?
- భారతదేశంలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీలలోని వివిధ రిక్రూట్‌మెంట్లలో ఓబీసీ రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయడం లేదు ?